లిఫ్ట్ ఆపరేటర్లుగా పాతవారినే కొనసాగించాలి

- బీఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యుడు ఆంజనేయులు

నడిగూడెంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నడిగూడెం, డిసెంబర్ 26: ఎత్తిపోతల పథకాల్లో లిఫ్ట్ ఆపరేటర్లుగా పాతవారినే కొనసాగించాలని బీఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యుడు అనంతుల ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రం నడిగూడెంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకాల్లో నిబంధనలు పాటించకుండా కొత్తవారిని నియమిస్తున్నారని ఆరోపించారు. పాతవారినే కొనసాగిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నడిగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్, నాయకులు దాసరి శ్రీనివాస్, బొల్లం శ్రీనివాస్, మౌలానా, ఎస్‌కే గౌస్, బడుగుల వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు

సమావేశంలో మాట్లాడుతున్న రాములు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 26: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేటలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ బిల్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్స్, పెన్షనర్ల రిటైర్మెంట్ బిల్లులు విడుదల చేయాలన్నారు. 2023 జూలై నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈ నెల 28 నుంచి 30 వరకు నల్లగొండలో జరిగే టీఎస్ యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్.అనిల్‌కుమార్, జె.యాకయ్య, కె.అరుణభారతి, జి.వెంకటయ్య, ఎన్.నాగేశ్వర్‌రావు, బి.ఆడం, రమేశ్, లాలు, పాండురంగాచారి, రవీందర్, సాంబయ్య, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి'

కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్

హుజూర్‌నగర్ రూరల్, డిసెంబర్ 26: రాష్ట్రంలో అర్హులైన వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు సాయంగా అందజేసి ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని అమరవరం గ్రామంలో వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు లింగమ్మ, రాంబాబు, మంగమ్మ, అరుణ, రమణ, పద్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీబీఈఎస్ఎస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 26: తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ (టీబీఈఎస్ఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం సూర్యాపేటలోని సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పాతులోతు దారాసింగ్, ప్రధాన కార్యదర్శిగా డి.రఘు, కోశాధికారిగా గుగులోతు హుస్సేన్, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా వాంకుడోతు వెంకన్ననాయక్‌ను ఎన్నుకున్నారు. సంఘం మాజీ అధ్యక్షుడు మంగత్యానాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల అధికారిగా రాములు నాయక్ వ్యవహరించగా, బి.బాలోజీనాయక్, డి.లాలు, జి.మోతీలాల్, బి.పాండు, డి.రఘుపతి, వినోద్, రామ్‌సింగ్, చందులాల్, లింగనాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

పశువుల కొట్టం దగ్ధం

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

తుంగతుర్తి, డిసెంబర్ 26: గుర్తు తెలియని వ్యక్తులు పశువుల కొట్టానికి నిప్పు పెట్టిన ఘటన మండలంలోని కొత్తగూడెంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వర్ధెల్లి మంగయ్యకు గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో పశువుల కొట్టం ఉంది. ఇటీవల అక్కడే ఇంటి నిర్మాణం కూడా చేపడుతున్నాడు. ఇంటికి అవసరమైన దర్వాజాలు, కిటికీలు, తలుపులు పశువుల కొట్టంలో భద్రపరిచాడు. అయితే, గుర్తు తెలియని వ్యక్తులు పశువుల కొట్టానికి నిప్పు పెట్టడంతో దర్వాజాలు, కిటికీలు, తలుపులతో పాటు ఎడ్లబండి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు మంగయ్య తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ క్రాంతికుమార్ గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 24 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.

NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం

పూర్తి వివరాలకు: నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | హుజూర్‌నగర్: 9182777638

పశువుల లెక్క.. ఇక పక్కా

- కొనసాగుతున్న పశుగణన
- 16 రకాల పశుజాతుల వివరాలు నమోదు
- 2025 ఫిబ్రవరి 28 నాటికి పూర్తికానున్న కార్యక్రమం

నేరేడుచర్ల, డిసెంబర్ 26: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశు సంపదకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువుల పాత్ర కీలకం. భూమిలేని అనేక మంది కుటుంబాలకు ప్రాథమిక ఆదాయం వనరు పశువులే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కాగా, ఈ పశువుల లెక్క ఇక పక్కాగా ఉండనుంది. ఇందుకోసం పశుసంవర్ధక శాఖ పశుగణన కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రతి ఇంట్లో ఎన్ని పశువులు ఉన్నాయో లెక్కించేందుకు గత అక్టోబర్ 25వ తేదీ నుంచి పశుగణన చేపడుతున్నారు. 2025 ఫిబ్రవరి 28 వరకు కార్యక్రమం కొనసాగనుంది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు ఇలా 16 రకాల పశు జాతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ఐదేళ్ల కోసారి లెక్కింపు

పశుగణన అనేది 1919 సంవత్సరంలో ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన కార్యక్రమం చేపడుతున్నారు. ఇప్పటి వరకు 20 సార్లు పశుగణన చేపట్టారు. 2019లో జరిగిన పశుగణనలో జిల్లాలో తెల్ల జాతి పశువులు 95,145, గేదెలు 2.89 లక్షలు, గొర్రెలు 7.79 లక్షలు, మేకలు 1.40 లక్షలుగా నమోదయ్యాయి. ప్రస్తుతం జిల్లాలోని 486 గ్రామ పంచాయతీల్లో 21వ పశుగణన కార్యక్రమం కొనసాగుతోంది. 39 మంది సూపర్‌వైజర్లు, 180 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నారు. ఈ పశుగణనతో జిల్లాలో ఏయే రకాల పశువులు ఉన్నాయనే విషయం తెలిసిపోతుంది. తద్వారా అవసరాల మేరకు పశు వైద్యశాలలు, సిబ్బంది, మందులను ఏర్పాటు చేసుకోవచ్చు. పాడి పరిశ్రమ తీరు, వాటి అభివృద్ధి, పశుగణాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, నిధుల కేటాయింపు, పథకాల రూపకల్పన వంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉంటుంది.

తొలిసారి ఆన్‌లైన్‌లో నమోదు

ఎన్యూమరేటర్లు జిల్లాలోని అన్ని ఇళ్లను సందర్శించి పూర్తి సమాచారాన్ని తీసుకుంటారు. సర్వే నిర్వహించిన ప్రతి ఇంటికీ స్టిక్కర్ వేస్తారు. పశు పోషణలో ఉన్న రైతులు, కుటుంబాల వివరాలను సేకరించడంతోపాటు పశువుల వయస్సు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గతంలో రికార్డుల్లో నమోదు చేయగా తొలిసారి ఆన్‌లైన్‌లో పశుగణన వివరాల నమోదు చేపడుతున్నారు. సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నారా, లేదా అనే విషయంపై పశువైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారు. సర్వే వివరాలను నోడల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరికి గాయాలు

క్షతగాత్రుడి వివరాలు తెలుసుకుంటున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి, డిసెంబర్ 26: బైక్‌ను లారీ ఢీకొనడంతో ఒకరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలోని రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జున సిమెంట్స్ ఫ్యాక్టరీ మెస్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్న హుస్సేన్ విధులు ముగించుకొని బైక్‌పై తన స్వగ్రామమైన హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి గ్రామానికి బయలుదేరాడు. మండల కేంద్రంలోని రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలోకి రాగానే హుజూర్‌నగర్ నుంచి నాగార్జున సిమెంట్స్ ఫ్యాక్టరీ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హుస్సేన్‌కు గాయాలయ్యాయి. కాగా, అదే సమయంలో విధుల నిమిత్తం మట్టపల్లి వెళ్తున్న సీఐ చరమందరాజు వెంటనే గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హుస్సేన్ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు.

జనవరిలో 'తెలంగాణ గోల్డ్ కప్-2025'

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 26: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరిలో తెలంగాణ గోల్డ్ కప్-2025 క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా హెడ్ కోచ్ వి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌తో పాటు 32 జిల్లాల్లో ఈసారి తెలంగాణ గోల్డ్ కప్ పేరుతో క్రికెట్ సంబురాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముందుగా నమోదు చేసుకున్న జట్లకు మాత్రమే అవకాశం కల్పిస్తామని తెలిపారు. విజేతలకు రూ.50 వేల నగదు బహుమతి, రన్నరప్‌కు రూ.25 వేలు అందించనున్నట్లు వివరించారు. సూర్యాపేట జిలా క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 87908 03238 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పురుగుల మందు పిచికారీతోనే కల్లు కలుషితం

- కల్తీ కల్లు విక్రయించిన వ్యక్తిపై కేసు

శాలిగౌరారం, డిసెంబర్ 26 : ఈత చెట్టుకు పురుగు పట్టిందని చెట్టు మొగిళ్లలో క్రిమిసంహారక మందును(మోనోక్రొటోపాస్) పిచికారీ చేయడం వల్లే కల్లు కలుషితమైందని, కల్తీ కల్లు తాగి ఆరుగురు తీవ్ర అస్వస్థకు గురైన ఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గురువారం నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. చాణక్య కేసు వివరాలను వెల్లడించారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన గీతకార్మికుడు పల్స వెంకన్న ఈ నెల 22న ఈత చెట్టుకు పురుగు పట్టిందని, దాంతో చెట్టు చనిపోతుందని భయపడి చెట్టు మొగిళ్లలో క్రిమిసంహారక మందును పిచికారీ చేశాడు. ప్రస్తుతం కురుస్తున్న మోస్తరు వర్షానికి మొగిలిలో పోసిన క్రిమిసంహారక మందు కిందికి కారి చెట్టుకు కట్టిన లొట్టిలో పడింది. అది గమనించని గీత కార్మికుడు బుధవారం గ్రామానికి చెందిన ఆరుగురికి అదే కల్లును పోశాడు. పురుగుల మందు కలిసిన కల్లు తాగిన గ్రామస్తులు అస్వస్థతకు గురైనట్లు ఆయన తెలిపారు. ఈవిషమై గురువారం పెర్కకొండారం గ్రామానికి శాలిగౌరారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వెళ్లి విచారణ చేపట్టడంతో ఈ విషయం తెలిసింది. బాధితుడు వెంకన్న నుంచి క్రిమిసంహారక మందు, లీటర్ కల్లు, కల్లు కుండ, ప్లాస్టిక్ బాటిల్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. పల్స వెంకన్నపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

ఒకరి పరిస్థితి విషమం

కల్తీకల్లు తాగిన బాధితుల్లో ఒకరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. మిగతా ఐదుగురు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధితుల్లో ఒకరు డిశ్చార్జి కాగా పిచ్చయ్యకు రక్త కణాలు తగ్గినట్లు, ప్రస్తుతం దవాఖానలోనే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నకిరేకల్‌లో చికిత్స పొందుతున్న నలుగురిలో భిక్షంను మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

జూనియర్ బాలుర కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

హాలియా, డిసెంబర్ 26 : జూనియర్ బాలుర కబడ్డీ నల్లగొండ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

జట్టుకు కెప్టెన్‌గా గర్నేకుంట గ్రామానికి చెందిన పి. భరత్ ఎంపికయ్యాడు. మిగతా క్రీడాకారులు సీహెచ్ గణేశ్ (మిర్యాలగూడెం), ఎం. గిరి (గుడిపల్లి), పి. రాజు (పాలీతండా), ఎస్, శ్రీపాదం (పెద్దగట్టు), డి.మధు (అనుముల), జి.వేణు (ఇబ్రహీంపేట), కె.రాకేశ్ (మదారిగూడెం), సీహెచ్ హన్మంత్ (వెల్మగూడెం), ఆర్. శివ (కొదండాపురం), కె. అనిల్ (వెల్మగూడెం), ఎన్.వెంకటేశ్(తుంగతుర్తి), ఎస్‌కే వహీద్ (తడకమల్ల), టీం కోచ్‌గా కె. సైదులు, టీం మేనేజర్‌గా సత్యనారాయణ ఎంపికయ్యారు.

'కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి'

పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, డిసెంబర్ 26 : పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆదేశించారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి మాట్లాడారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న టూటౌన్ సీఐ పి.నాగార్జున, ఎస్ఐలు బి.రాంబాబు, డి.హరీశ్‌రెడ్డిని డీఎస్పీ అభినందించారు.

సూర్యాపేట ద్వితీయశ్రేణి న్యాయమూర్తిగా వెంకటరమణ

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 26: సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా బి.వెంకటరమణ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో నల్లగొండ జిల్లా నకిరేకల్ కోర్టులో న్యాయవాదిగా పనిచేశారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కోటిరెడ్డి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దొండపాడు గ్రామానికి చెందిన న్యాయవాది బొబ్బా కోటిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

యువతి అదృశ్యంపై కేసు

హుజూర్‌నగర్, డిసెంబర్ 26: ఓ యువతి అదృశ్యంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన కర్నె స్పందన (22) పీజీ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటోంది. ఈ నెల 24వ తేదీన తల్లిదండ్రులు పనుల కోసం బయటకు వెళ్లగా స్పందన ఇంట్లోనే ఉంది. తల్లిదండ్రులు సాయంత్రం తిరిగి వచ్చిచూడగా ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం స్పందన తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మోతె, డిసెంబర్ 26: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన ఘటన మండలంలోని రాఘవాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొరిపెల్లి గోవర్ధన్ అనే వ్యక్తి రోజు మాదిరిగానే గురువారం పశువులను మేత కోసం తోలుకెళ్లాడు. ఈ క్రమంలోనే అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం స్టే వైర్‌కు కరెంట్ సరఫరా కావడంతో గేదె దానికి తగిలి మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

నేడు బెటాలియన్‌లో దీక్షాంత్ పరేడ్

నీలగిరి, డిసెంబర్ 26 : ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్ దీక్షాంత్ పరేడ్‌ను ఈ నెల 27న 12వ బెటాలియన్‌లో నిర్వహించనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 450 మంది (వికారాబాద్ జిల్లా నుంచి 107, కామారెడ్డి జిల్లా నుంచి 129, రామగుండం నుంచి 214 మంది) 12వ బెటాలియన్‌లో కఠోరమైన ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పీఅండ్ఎల్ ఐజీ ఎం.రమేశ్ హాజరవుతున్నట్లు తెలిపారు. తొమ్మిది నెలల శిక్షణ కాలంలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పుడమిరత్న అవార్డుకు లిటిల్ సోల్జర్స్ ఎంపిక

నకిరేకల్, డిసెంబర్ 10 : నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ సభ్యులు పుడమిరత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికైనట్లు పుడమి సాహితీవేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ఏళ్లుగా చిన్నారుల వైద్యానికి సాయం అందించడంతో పాటు నిరుద్యోగులకు ఉచిత స్టడీహాల్, అనాథాశ్రమాలకు, నిరుపేదలకు చేయూత అందించడం, రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు అందించినందుకు గానూ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా అవార్డు అందిస్తారని తెలిపారు.

పెద్దగట్టు జాతరకు పూర్తి ఏర్పాట్లు

- రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పటేల్ రమేశ్‌రెడ్డి

చివ్వెంల, డిసెంబర్ 26: పెద్దగట్టు జాతరకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని, దేవాలయం వద్ద శాశ్వత నిర్మాణాలు చేపడతామని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం పెద్దగట్టు ఆలయాన్ని సందర్శించిన ఆయన, జాతర ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలోనే పెద్దగట్టు ఆలయానికి చైర్మన్‌ను నియమిస్తామని తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గుట్ట అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి రూ.10 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు వెల్లడించారు. గుట్టపైకి వాహనాలు వెళ్లడానికి రోడ్డు నిర్మిస్తామని, భక్తులు రాత్రి నిద్ర చేసేందుకు వసతి గృహం, పూజారులకు నివాసాలు ఉండేలా రెసిడెన్షియల్ క్వార్టర్లు, భక్తులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, కౌన్సిలర్ ఫషీ ఉల్లా, ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, ఫారూఖ్, రమేశ్‌నాయుడు, ధర్మానాయక్, బైరబోయిన శ్రీనివాస్, సైదిరెడ్డి, వల్దాస్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుకు ఐక్య ఉద్యమాలు

- తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రవి

సమావేశంలో మాట్లాడుతున్న రవి

మోతె, డిసెంబర్ 26: ఆరోగ్యాలకు హానీ కలిగించే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు అయ్యేంత వరకు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కన్నెగంటి రవి ప్రజలకు, ప్రజా సంఘాలు, పార్టీల నాయకులకు పిలుపునిచ్చారు. మండలంలోని రావిపాడు గ్రామంలో నిర్మంచనున్న ఎన్ఎంకే ఇథనాల్ ఫ్యాక్టరీ దుష్ఫలితాలపై గురువారం సర్వారం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా ఫ్యాక్టరీ నిర్మించడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. తక్షణమే ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రద్దు చేయాలని కోరారు. ఎన్ఎంకే ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు ఉప్పల సందీప్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జర్నలిస్టు పద్మ, మాజీ సర్పంచ్ మిక్కిలినేని పురుషోత్తంరావు, నల్లాల శ్రీను, ఎం.డేవిడ్‌కుమార్, మట్టిపల్లి సైదులు, పేర్ల నాగయ్య, నల్లెడ మాధవరెడ్డి, నారబోయిన వెంకటయాదవ్, ఆవుల నాగరాజు, నకిరేకంటి చిట్టిబాబు, గుండు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'విలీన సభను విజయవంతం చేయాలి'

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 26: ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక చండ్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇప్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు సింహాద్రి, వీరబోయిన రమేశ్, పెద్దింటి అశోక్‌రెడ్డి, దండి ప్రవీణ్, దుర్గయ్య, దూదిపాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు